## క్లుప్తంగా

### తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం



తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని నిర్మించిన తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జేసీ ఎం.నవీన్, టెక్కలి సబ్‌కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం ప్రారంభించారు. గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు అత్యధిక సేవలందించేది రెవెన్యూశాఖ అన్నారు. ఎమ్మెల్యే రెడ్డిశాంతి మాట్లాడుతూ త్వరలోనే మెళియాపుట్టి మండలంలోనే ఐటీడీఏ సైతం ఏర్పాటు చేయడం జరుగుతుందని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సహకారానికి రుణపడి ఉంటామన్నారు. తహసీల్దార్ సరోజిని, ఎంపీడీఓ చంద్రకుమారి, ఏఓ తిరుపతి పట్నాయక్, ఆర్‌ఐ వైకుంఠరావు, డీటీలు వాన శంకర్, భీమారావు జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, మండల నాయకుడు బైపోతు ఉదయ్‌కుమార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



చీపుర్ల తయారీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్

సారవకోట: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఆర్‌డీఏ పీడీ డీవీ విద్యాసాగర్ అన్నారు. మండలంలోని పాతూరు గ్రామంలో సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వందన్ వికాస్ కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఈ కేంద్రం ద్వారా మహిళలు తయారు చేస్తున్న చీపుర్లను పరిశీలించారు. చీపుర్ల తయారీతో పొందుతున్న ఆదాయం, మార్కెటింగ్, తదితర అంశాలను వారిని అడిగి తెలుసుకున్నారు. వందన్ వికాస్ కార్యక్రమం ద్వారా యంత్రాలు సైతం పొందచ్చునని, దానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీఎం గోవిందరాజులు, సీసీ ప్రభావతి, వీవోఏ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

### ఫ్యామిలీ డాక్టర్‌తో ఆధునిక వైద్యం

మెళియాపుట్టి: ప్రజలకు ఆధునిక వైద్యసేవలు ఉచితంగా అందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని చాపర పీహెచ్‌సీ వైద్యులు పావని అన్నారు. మండలంలోని మారడికోట గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. 85 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఏఎన్‌ఎం మహాలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### రూ.20 వేల ఆర్థికసాయం

నరసన్నపేట:మండలంలోని మడపాం గ్రామానికి చెందిన గంగరాపు ఈశ్వరమ్మ సారవకోట మండలం వెలుగు కమ్యూనిటీ కో ఆర్డినేటర్‌గా పనిచేస్తూ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ మంగళవారం పరామర్శించారు. ఆ కుటుంబానికి మహిళా జిల్లా సమాఖ్య ద్వారా రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఏసీ కొండలరావు, ఏపీఎం లక్ష్మి, హేమసుందరరావు, సారవకోట ఏపీఎం గోవిందరావు ఉన్నారు.

### మెనూ విధిగా పాటించాలి

బూర్జ: మండలంలోని ఉప్పినివలస జెడ్పీ హైస్కూల్లో జగనన్న గోరుముద్ద ద్వారా అందజేస్తున్న మధ్యాహ్న భోజనాలను ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు మంగళవారం పరిశీలించారు. మెనూ విధిగా పాటించాలని సూచించారు. వంట ఏజెన్సీలు భోజనం విషయంలో మరింత శ్రద్ధ కనబర్చాలన్నారు. ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న తమ్మినేని చిరంజీవినాగ్

బూర్జ: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ అన్నారు. మండలంలోని ఉప్పినివలసలో జగనన్న మాట–నాని అన్నబాట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ స్థాయిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. ఆమదాలవలస నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేశామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు, ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తినాయుడు, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకటరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



పొందూరు: ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



చల్లవానిపేటలో లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో కృష్ణదాస్

# గడపగడపకు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

పొందూరు/జలుమూరు/మెళియాపుట్టి: గడపగడపకు సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి అన్నారు. పొందూరు మండలంలోని తండ్యాం పంచాయతీలోని ఎస్‌ఆర్‌ఎన్ కాలనీ, మన్నెపేట, లక్ష్మీపురం, బొట్లపేట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని స్పీకర్ మంగళవారం నిర్వహించారు. జలుమూరు మండలం చల్లవానిపేటలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, మెళియాపుట్టి మండలంలోని కొసమాలలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



మెళియాపుట్టి: కొసమాలలో నవరత్నాలను వివరిస్తున్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

## ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు

- స్పీకర్ తమ్మినేని సీతారాం



ఉప్పినివలసలో ఇంటింటికీ కుళాయిల కార్యక్రమానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

బూర్జ: నియోజకవర్గంలో ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని వావాం పంచాయతీ పరిధి వువ్వపేటలో రూ.23.50 లక్షలు, ఉప్పినివలసలో రూ.45 లక్షలతో జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీటి కుళాయిల కార్యక్రమానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో మహిళలు పడుతున్న కష్టాలు చూసి గ్రామాల్లో ప్రతీ గడపకు తాగునీరు అందించాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు, ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తినాయుడు, పీఏసీఎస్ చైర్మన్ బగాది నారాయణమూర్తి, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకటరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని లక్ష్మీనర్సుపేట, పెద్దకోట గ్రామాల్లో విత్తనాలు, ఎరువుల పంపిణీని మంగళవారం ప్రారంభించారు. ఈ ఏడాది ఖరీఫ్ వరిసాగులో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందజేస్తున్నామన్నారు. ఆర్‌బీకేల ఏర్పాటు, వైఎస్సార్ పశు బీమా, రైతులకు వడ్డీ లేని రుణాలు, రైతు భరోసా పెట్టుబడి సాయం ఇలా రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమల్లోకి తీసుకుని వచ్చిన ఘనత జగనన్నకు దక్కిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయం దండగ అన్నారని గుర్తుచేశారు. అలాంటి పరిస్థితి నుంచి వ్యవసాయం పండగలా చేసుకునే రోజుల్లోకి జగనన్న రైతులకు తీసుకువచ్చారన్నారు. ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, ఏఓ పైడి లతశ్రీ, సర్పంచ్ ముగడ దివాకర్, వైఎస్సార్‌సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ పెనుమజ్జి విష్ణుమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల కృష్ణ, పార్టీ నాయకులు ముగడ జనార్దన, లోచర్ల మల్లేశ్వరావు, లుకలాపు సుధీర్, బలగ గోవిందరావు, తలసముద్రం శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## బాబ్జీ విగ్రహావిష్కరణ



బాబ్జీ విగ్రహావిష్కరణలో మంత్రి ప్రసాదరావు, ఎమ్మెల్యే కృష్ణదాస్

నరసన్నపేట: ఒకరికి మంచి చేయాలనే తలంపుతో నిత్యం ఉంటూ సమాజహితం కోరే వ్యక్తి టంకాల బాబ్జీ అని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నరసన్నపేటలోని గోరువాని చెరువు గట్టు వద్ద బాబ్జీ వర్థంతి సందర్భంగా ఆయన అభిమానులు ఏర్పాటు చేసిన విగ్రహాన్ని మంత్రి ధర్మాన, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నా రాజకీయ జీవితంలో బాబ్జీకి ఎంతో ప్రధాన పాత్ర ఉందన్నారు. బాబ్జీ విగ్రహం నరసన్నపేటలో మంచి సెంటర్‌లో ఏర్పాటు చేయండి, నిబంధనల మేరకు పంచాయతీ తీర్మానం చేసి కలెక్టర్‌కు పంపండని నరసన్నపేట పంచాయతీ సర్పంచ్ బూరల్లి శంకర్‌కు సూచించారు. ఎమ్మెల్యే కృష్ణదాస్ మాట్లాడుతూ నరసన్నపేట అభివృద్ధికి బాబ్జి ఎంతో కృషి చేశారన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబానికి చెందిన బాబ్జీ ఉన్నత భావాలు కలిగిన వ్యక్తి అని కొనియాడారు. కళింగ కాముట్ల కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు ధర్మాన రామదాసు, గొండు కృష్ణ, నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, పార్టీ నాయకులు చింతు రామారావు, కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ, బాబ్జీ అభిమాన సంఘం ప్రతినిధులు తంగుడు జోగారావు, పాట్నూరు నీలం, ఇట్రాజు సూరిబాబు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి



కలివరం వద్ద ఏర్పాటు చేస్తున్న స్తంభాలు

ఆమదాలవలస రూరల్: గ్రామాల్లో నెలకొన్ని విద్యుత్ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్ తెలిపారు. మండలంలో కలివరం సమీపంలో చిలకపాలెం మెయిన్ సబ్‌స్టేషన్ నుంచి తొగరాం సబ్‌స్టేషన్‌కు వచ్చే విద్యుత్ లైన్లు సక్రమంగా లేకపోవడంతో వాటిని మంగళవారం మరమ్మతులు చేశారు. కలివరం, దూసి, హనుమంతుపురం, కొర్లకోట గ్రామాలకు వెళ్లే మెయిన్ ఫీడర్‌లో కొత్తగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. తొగరాం సబ్‌స్టేషన్ నుంచి గ్రామాలకు వెళ్లే విద్యుత్ లైన్లకు ఎటువంటి అంతరాయం లేకుండా ఎత్తుగా ఉన్న స్తంభాలను ఏర్పాటు చేసి, లైన్లకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించారు. గ్రామాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతరం సరఫరా చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

## మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం




మాట్లాడుతున్న డీఆర్‌డీఏ విద్యాసాగర్

పాతపట్నం: మహిళా సాధికారతే ధ్యేయంగా, గ్రామీణ మహిళలను ఆర్థికంగా ఆదుకునేందుకు డ్వాక్రా సంఘాలను రాష్ట్ర ప్రభుత్వం బలోపేతం చేస్తోందని, వైకేపీ పథకాలు సక్రమంగా అమలు చేయాలని డీఆర్‌డీఏ పీడీ డి.విద్యాసాగర్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం క్లస్టర్ పరిధిలోని ఏపీఎంలు, సీసీలతో వైకేపీ ద్వారా అమలు చేస్తున్న పథకాలపై పీడీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌హెచ్ గ్రేడింగ్‌లో వెనుకబడిన అన్ని సంఘాలూ ఏ–గ్రేడ్‌లో ఉండాలని ఆదేశించారు. వందన వికాస కేంద్రాలు సక్రమంగా పనిచేయాలని, కొనుగోలు, అమ్మకాలు ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. ఏపీడీ ఆర్.వి.రమణ, డీపీఎం రామ్మోహనరావు, ఎల్‌హెచ్ డీపీఎం బి.నారాయణరావు, ఏపీఎం పి.మనోరత్నం, లలిత, పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, మందస ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

సరుబుజ్జిలి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తోందని కొత్తకోట జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం టి.వి.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని చిగురువలస, చిగురువలస కాలనీ, కొండ్రగూడ గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. 6వ తరతగతిలో చేరాలని అవగాహన కల్పించారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వం పాఠశాలలను పనిచేస్తున్నాయన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం, పుస్తకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అనుభవం గల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో బోధన ఉంటుందని విద్యార్థులు, తల్లిదండ్రులు వినియోగించుకోవాలన్నారు.

### బదిలీ ఉద్యోగులకు సన్మానం

సారవకోట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన పలువురు ఉద్యోగులకు మంగళవారం సన్మానించారు. తహసీల్దార్ ప్రవల్లికాప్రియ, డీటీ ఎం.సరిత, సర్వేయర్ మహేశ్‌ను సత్కరించారు. తహసీల్దార్ హనుమంతరావు, ఎంపీడీఓ విశ్వేశ్వరరావు, ఎంఈఓ ఎం.వి.రమణ, ఏపీఓ సత్యమూర్తి, డీటీ మధుబాబు, వీఆర్వోల సంఘం అధ్యక్షుడు గజపతి నారాయణ, పలువురు వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### నాయీబ్రాహ్మణ గర్జనకు తరలిరండి

సారవకోట: ఈ నెల 27న జరగనున్న నాయీ బ్రాహ్మణ గర్జనకు తరలిరావాలని ఆ సంఘం మండల కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఈ గర్జనకు సంబంధించిన కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. జిల్లాలోని నాయీబ్రాహ్మణుల ఐక్యతను చాటుతూ చేపట్టనున్న ఈ గర్జనకు ప్రతీఒక్కరూ హాజరుకావాలని కోరారు.

### సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

ఆమదాలవలస రూరల్: మండలంలోని శ్రీహరిపురం గ్రామంలో గల లలితాదేవీ పీఠంలో వేదపండితులు ఆరవెల్లి భాస్కరశర్మ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని కోరుతూ స్వామి వారికి అర్చన, మూల మంత్ర జపాలు, హోమాలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు.

### పౌష్టికాహారం అందించాలి

పాతపట్నం: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని పాతపట్నం సెక్టర్ సూపర్‌వైజర్ జి.అనూరాధ అన్నారు. మండల కేంద్రంలోని దువ్వారివీధిలో ఉన్న పాతపట్నం–9 అంగన్‌వాడీ కేంద్రంలో జన్‌భాగీదారి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన నేర్పుస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త బి.శాంతమణి, మహిళా పోలీస్ గౌతమి, ఏఎన్‌ఎం పావని,చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

### ఏకగ్రీవంగా వీఆర్‌ఏల సంఘం ఎన్నిక

కొత్తూరు: మండలం వీఆర్‌ఏల సంఘం ఎన్నిక మంగళవారం కొత్తూరు తహశీల్దార్ కార్యాలయంలో ఏకగ్రీవంగా జరిగింది. వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడిగా డి.అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడిగా కుప్పిలి రామారావు, కార్యదర్శిగా దుంపల సూరయ్య, సహాయ కార్యదర్శిగా కురజాన సుజాత, కోశాధికారిగా దవసింగి గణపతి ఎన్నికయ్యారు. సభ్యులుగా జి.గణపతి, రాము, సి.హెచ్.రవి, శివశంకర్, రెయ్యమ్మ, సుందరమ్మ, వేణమ్మ, ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. వీఆర్‌ఏ జిల్లా సంఘం సహాయ కార్యదర్శి త్రినాథరావు ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు.

## ఉపాధి పనుల్లో అక్రమాలు

- దిద్దుబాట్లు, సంతకాల్లేకుండా మస్తర్లు..



సామాజిక ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

ఎల్.ఎన్.పేట: ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని సామాజిక తనిఖీ బృందం గుర్తించిన పలు అంశాలను సామాజిక తనిఖీ ప్రజా వేదికలో చదివి వినిపించారు. 2022–23లో మండలంలో చేపట్టిన 268 పనులు, ఖర్చు చేసిన రూ.10.31 కోట్లు నిధులకు సంబంధించి మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం సామాజిక ప్రజా వేదిక నిర్వహించారు. పది రోజులు పాటు గ్రామాల్లో డీఆర్పీలు గుర్తించిన అంశాలు ఇలా ఉన్నాయి. టి.కె.పురం, బొత్తాడసింగి, రావిచెంద్రి పంచాయతీల్లో మస్తర్లపై వేతనదారుల సంతకాల్లేకుండా అందించారని, గొట్టిపల్లి, లక్ష్మీనర్సుపేట, మిరియాపల్లి, యంబరాం గ్రామ పంచాయతీల్లో మస్తర్లలో దిద్దుబాట్లు, కొట్టివేతలు చోటు చేసుకున్నాయని గుర్తించారు. ఫీల్డ్ అసిస్టెంట్లుపై చర్యలు తీసుకుంటామని ప్రజా వేదిక అధికారి, డ్వామా ఫైనాన్స్ మేనేజర్ ఆర్.స్వరూపారాణి స్పష్టం చేశారు. పలు పంచాయతీల్లో కొలతల్లో తేడాలు ఉన్నాయని గుర్తించారు. బాధ్యులైన టెక్నికల్ అసిస్టెంట్లకు సంజాయిషీ కోరుతూ నోటీసులు జారీ చేయటం జరుగుతుందన్నారు. కొందరు టీఏలకు అపరాధ రుసుం విధించారు. ఒకే జాబ్‌కార్డులో ఐదు మంది కుటుంబ సభ్యులు ఉన్నందున పని సమయంలో 100 రోజులు పూర్తయి ఇబ్బంది పడుతున్నారని, అలాంటి జాబ్ కార్డుల్లో వివాహం జరిగిన వారిని వేరు చేసి జాబ్ కార్డులు ఇవ్వాలని కోరినట్లు డీఆర్పీలు తెలిపారు. ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, ఉపాధి ఏపీడీ పంచాది రాధ, విజిలెన్స్ అధికారి లవరాజు, హెచ్‌ఆర్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్, పీఆర్ జేఈ ఎన్.భాస్కరరావు, ఎస్‌ఆర్పీ కె.మన్మథరావు, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## జగనన్న విద్యాకానుకల పంపిణీ



హిరమండలం: అవలంగిలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

హిరమండలం/ఎల్.ఎన్.పేట/జలుమూరు/బూర్జ/కొత్తూరు/నరసన్నపేట/ఆమదాలవలస: హిరమండలం మండలంలోని అవలంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లును ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం పంపిణీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. లక్ష్మీనర్సుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో, కొత్తూరు మండలంలోని మెట్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లును ఎమ్మెల్యే రెడ్డి శాంతి పంపిణీ చేశారు.

జలుమూరు మండలంలోని కరవంజ మోడల్ స్కూల్, జలుమూరు కేజీబీవీలో జగనన్న కిట్లు ఎంపీపీ వాన గోపి పంపిణీ చేశారు. పాతపట్నం మండలంలోని గంగువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పి.ఆర్.వల్లభరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు జగనన్న కిట్లును వైఎస్సార్‌సీపీ నాయకుడు పోతుల శ్రీనువాసరావు అందజేశారు. నరసన్నపేటలోని వంశధార నగర్ స్కూల్ విద్యార్థులకు కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పాట్నూరు సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు.

బూర్జ మండలంలోని ఓ.వి.పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిట్లును వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు అందజేశారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి మెట్టక్కివలసలోగల మున్సిపల్ బాలికోన్నత పాఠశాల, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లును వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్ పంపిణీ చేశారు.